Follow :netifocusnewsdaily
www.netifocusnews.com
FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
హైదరాబాద్
సోమవారం
22-9-2025
వెల: రూ.4/-
సంపుటి: 01 సంచిక: 40
పేజీలు: 04
Published From: Hyderabad
Editor: Mankali Tharun




# జీఎస్టీ డబుల్ బొనాంజా!

## మేక్ ఇన్ ఇండియా వస్తువులనే కొనాలి

- 2014కి ముందు ప్రజలే పన్నులను భరించారు
- 2017లో అమలు.. ఇప్పుడు సంస్కరణలు
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ నవరాత్రి శుభాకాంక్షలు
- ప్రధాని నరేంద్ర మోదీ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్21

**ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రధాని** నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రసంగం కేవలం 10 నిమిషాలపాటు కొనసాగింది. ప్రధానంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రసంగం చేశారు. 2014లో దేశ ప్రజలు తమకు అవకాశం ఇచ్చినప్పుడే జాతీయ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించుకున్నామని, అతిపెద్ద పన్ను సంస్కరణలను దేశ ప్రజలందరినీ కలుపుకొని చేపట్టామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డజన్ల కొద్దీ పన్నుల నుంచి విముక్తి పొందినట్లు, ఒకే దేశంలో ఒకే పన్ను విధానం నిజమైందని స్పష్టం చేశారు. మోదీ ప్రకారం, సంస్కరణలు నిరంతర ప్రక్రియలని, కాలానుగుణంగా అవసరాల దృష్ట్యా మార్పులు అవసరమని తెలిపారు.జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశ ప్రజలకు రూ.2.5కోట్లు ఆదా అవుతాయని, తద్వారా వారి ఇతర అవసరాలను తీర్చుకోవచ్చునని, ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు సాగడంలో ఈ సంస్కరణలు గణనీయంగా సహాయపడుతాయని చెప్పారు. 99 శాతం వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల సామాన్యతరగతి, పేద ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, రోజువారీ వస్తువుల ధరలు తగ్గించడం ద్వారా జీవిత సౌలభ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా మేక్ ఇన్ ఇండియా లో తయారైన వస్తువులనే ప్రతి ఒక్కరూ కొనాలని, యువత కృషితో, స్వేదంతో తయారైన వస్తువులను మాత్రమే మిగతా 2లో..



# ఒక్కొక్కరి భరతం పడతా

- చింతమడక పౌరుషం ఎలా ఉంటుందో చూపిస్తా
- సిద్దిపేట ఎవరి జాగీర్ కాదు ఇక్కడ ఎవరి ఆంక్షలు పనిచేయవు
- ఈ జన్మలో చింతమడక ప్రజల మేలు మర్చిపోను
- చింతమడకలో బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

2





# ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెస్ వైఫల్యం కారణం

- వరద బాధితులకు ఒక్క రూపాయి సహాయం చేయలేదు
- వానా కాలానికి ముందే నాలాలు శుభ్రం చేయాల్సింది
- కేసీఆర్ నేతృత్వంలో నాలాలన్నీ క్లీన్ చేయించేవారు
- సనత్‌నగర్ రాంగోపాల్‌పేటలో బాధితులకు నిత్యావసరాల పంపిణీ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

2

# జల హక్కులపై రాజీ లేదు

- తెలంగాణ వాటా కోసం ఎవరితోనైనా, ఏ స్థాయిలోనైనా పోరాటానికి వెనుకాడను
- ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు ప్రతిపాదనపై తెలంగాణ పూర్తి వ్యతిరేకం
- కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధ హక్కు సాధించనున్నాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

# రాష్ట్రవ్యాప్తంగా మొదలైన బతుకమ్మ వేడుకలు

## తెలంగాణకు బతుకమ్మ శోభ

- ఎంగిలిపూల బతుకమ్మల వద్ద మహిళల సందడి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఘనంగా వేడుక
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి,
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- గ్రేటర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు తెలంగాణ
- చెరువులు, ఆలయాల వద్ద ఆడిపాడిన మహిళలు

4





# డ్రగ్స్‌ను తరిమికొట్టాలి

- డ్రగ్స్ రహిత దేశం కోసం సమైక్య పోరాటం అవసరం
- డ్రగ్స్ మహమ్మారి అరికట్టడంలో తల్లిదండ్రుల కీలక భూమిక
- యువతను కాపాడితేనే దేశ భవిష్యత్తు రక్షితం: కిషన్ రెడ్డి

2



# దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

- సిద్ధంగా ఉండాలని పోల్ అధికారులకు ఈసీ ఆదేశం
- అక్టోబర్%-%నవంబర్‌లో ఓటర్ లిస్ట్ క్లీనప్ వ్యాయామం ప్రారంభం

2



## ప్రాణాలు కోల్పోవడానికి కారణం కాంగ్రెస్ వైఫల్యం

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్):** వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఒక్క రూపాయి సహాయం కూడా వరద బాధితులకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు హైదరాబాద్‌లో ఏడెనిమిది మంది నాలాల్లో కొట్టుకుపోయి చనిపోయారన్నారు. వారి చావులకు కారణం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని దుయ్యబట్టారు.రేవంత్ రెడ్డి స్వయానా మున్సిపల్ శాఖ మంత్రిగా ఉంటూ.. బస్తీలను పట్టించుకొక, నాలాలు శుభ్రం చేయకపోవడం వల్ల నాలాల నుంచి వరద వచ్చిందని ఆయన విమర్శించారు. వానాకాలానికి ముందే నాలాలన్నీ శుభ్రం చేయాలని, గతంలో కేసీఆర్ నాయకత్వంలో తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్ హైదరాబాద్ నగరంలో నాలాలన్నిటినీ క్లీన్ చేయించేవారని గుర్తు చేశారు.హైదరాబాద్ సనత్‌నగర్‌లోని రాంగోపాల్‌పేట డివిజన్‌లో వరదలో మునిగిపోయిన పలు కాలనీలను పరిశీలించి, బాధితులకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హరీశ్ రావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద వల్ల ఇంట్లో ఉన్నటువంటి నిత్యావసర వస్తువులు కూడా కొట్టుకుపోయాయన్నారు. తినడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు.కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని, రేవంత్ రెడ్డి పూర్తిగా బరితెగించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కుర్చీ పరువు తీసేలా రేవంత్ ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు.అలాగే బతుకమ్మ పండుగకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. పండుగ పూట గ్రామాల్లో చెత్త ఎత్తడానికి, ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి డబ్బులు లేవన్నారు. ఈ బతుకమ్మ పండుగ పూటైనా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి, అతిపెద్ద పండుగైన బతుకమ్మ పండుగను జరుపుకునేటట్టు చెయాలని డిమాండ్ చేశారు.

## డ్రగ్స్‌ను తరిమికొట్టాలి

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** ప్రధాని పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'సేవా పక్వాడా'లో భాగంగా ఆదివారంనాడు 'నశాముక్త్' (మత్తు నుంచి విముక్తి) 3కె రన్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసించే మేథాశక్తి భారత యువత సొంతమని అన్నారు. అలాంటి యువతను కాపాడుకోవడం ద్వారా దేశ భవిష్యత్తును రక్షించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. 2047 వరకు ప్రధాని నరేంద్ర మోదీ కన్న కల నెరవేరాలంటే దేశం నుంచి డ్రగ్స్ అనే మహమ్మారిని తరిమికొట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలంటూ విజ్ఞప్తి చేశారు. పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్యం పెంచుతూ, పిల్లలను మత్తుకు బానిసలుగా మార్చకుండా ఉండేందుకు భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో డ్రగ్స్ ఫ్రీ కంట్రీ కోసం సమైక్యంగా ఇటువంటి చర్యలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడం వల్ల యువత మేథోసంపత్తి దేశాభివృద్ధిలో కీలక సహకార యోగ్యంగా మారుతుందని, దీంతో అన్ని రంగాల్లో ప్రపంచాన్ని శాసించే అవకాశం భారత్‌కు లభిస్తుందన్నారు.

# ఒక్కొక్కరి భరతం పడతా



**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** సిద్దిపేట జిల్లా చింతమడక లో ఆదివారం నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆమె భావోద్వేగానికి గురై మాట్లాడుతూ.. 'చింతమడక తో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ సంవత్సరం నేను చాలా ఇబ్బందులు పడ్డాను. కుటుంబానికి దూరం అయ్యాను. రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. పార్టీ నుంచి బయటకు పంపించారు. పదవి వదులు కోవాల్సి వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నన్ను ఇంత ఆదరిస్తున్న చింతమడక ప్రజలకు ధన్యవాదాలు. గతంలో చింతమడక ఇచ్చిన ధైర్యంతోనే రాష్ట్రమంతా తిరిగా. చింతమడక ప్రజల మేలు ఈ జన్మలో మరిచిపోలేను. సంతోషంలో ఉంటే ఎవరైనా పిలుస్తారు.. మీరు నన్ను దు:ఖంలో ఉన్న సమయంలో పిలిచారు. మిమ్మల్ని ఎప్పటికీ మరువను.'చంద్రుడి లాంటి కేసీఆర్ కు మచ్చ తెచ్చారు. నన్ను నా కుటుంబానికి దూరం చేశారు. సిద్దిపేట వారి జాగీర్ అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఇవాళ ఇక్కడికి వస్తుంటే కూడా వారి కేజీఎఫ్‌లోకి వస్తున్నట్లు ఆంక్షలు పెట్టారు. సిద్దిపేట ఎవరి జాగీర్ కాదు. ఇక్కడ ఎవరి ఆంక్షలు పనిచేయవు. నా కుటుంబానికి ఈ పరిస్థితులు తీసుకొచ్చిన ఎవరినీ వదలను. ఒక్కొక్కరి భరతం పడతా. చింతమడక పౌరుషం ఎలా ఉంటుందో వారికి తప్పకుండా చూపిస్తా అని చెప్పారు.

# జల హక్కులపై రాజీ లేదు

- తెలంగాణ వాటా కోసం ఎవరితోనైనా, ఏ స్థాయిలోనైనా పోరాటానికి వెనుకాడమం
- ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు ప్రతిపాదనపై తెలంగాణ పూర్తి వ్యతిరేకం
- కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధ హక్కు సాధించనున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో ఎవరితోనైనా, ఏ స్థాయిలోనైనా పోరాటానికి వెనుకాడమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని వివరించిన ఉత్తమ్, ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న విచారణను ప్రస్తావిస్తూ, ఈ ప్రాజెక్టులో ఎవరైనా తప్పు చేసి ఉంటే వారు ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కాదని మంత్రి హెచ్చరించారు. తగిన ఆధారాలు బయటకు వస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన వెల్లడించారు.ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోందని గుర్తుచేశారు. రేపు ఢిల్లీకి వెళ్లి తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపిస్తానని, ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపును అడ్డుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన జలాల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, అవసరం అయితే ఏ రాష్ట్రంతోనైనా పోరాడతామని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నదులలో తెలంగాణకు చట్టబద్ధంగా లభించాల్సిన హక్కు వాటాను కచ్చితంగా సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణకు బతుకమ్మ శోభ

- ప్రభుత్వ ఘన ఏర్పాట్లు
- రాష్ట్రవ్యాప్తంగా పండుగ వైభవం
- ఆటపాటలతో ఉత్సవ హోరు
- పూల పరిమళంలో పల్లెలు, పట్టణాలు

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు జరగబోయే బతుకమ్మ పండుగలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల నుండి నగరాల వరకు అన్ని ప్రాంతాల్లో ఉత్సాహపూర్వకంగా బతుకమ్మ వేడుకలు జరుగుతున్నాయి. పూల పరిమళాలతో రాష్ట్రం నిండిపోతూ, ప్రతి వీధి పండుగ వాతావరణంలో తేలియాడుతోంది.

**ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనమైన ఏర్పాట్లు**

తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రతిసంవత్సరం విశేష ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద జరిగే సద్దుల బతుకమ్మ మహోత్సవం రాష్ట్రం గర్వంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు, బతుకమ్మ గీతాలు, కళాకారుల విన్యాసాలు రాష్ట్రం అంతటా ప్రసారమవుతున్నాయి. జిల్లాల వారీగా అధికారుల పర్యవేక్షణలో రవాణా, విద్యుత్, నీటి, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి. పల్లెల నుండి పట్టణాల వరకు చిన్నా పెద్దా వేదికలు ఏర్పాటు చేసి ప్రజలందరికీ పండుగలో భాగస్వామ్యం కల్పిస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా సంబరాల సవ్వడి**

తెలంగాణ గ్రామాలు, పట్టణాలు బతుకమ్మ పండుగ ఉత్సవ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. సాయంత్రం వేళ మహిళలు రంగురంగుల చీరలతో బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతూ పల్లె గీతాలు ఆలపిస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. చిన్న పిల్లల నుండి పెద్దవారిదాకా అందరూ పాల్గొంటూ ఉత్సవ వైభవాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ చెరువులు, వాగులు, నదులలో నిమజ్జనం చేస్తూ కుటుంబాలు కలసి విందులు చేసుకోవడం రాష్ట్రంలో సాధారణ సంప్రదాయం.



**తొమ్మిది రోజుల ప్రత్యేకతలు**

బతుకమ్మ పండుగలో ప్రతి రోజుకి ఒక ప్రత్యేకత ఉంది.

మొదటి రోజు–ఎంగిలిపూల బతుకమ్మ: చిన్నగా పూలతో తయారు చేసి ఆటపాటలతో పండుగకు నాంది.

రెండో రోజు– అటుకుల బతుకమ్మ: అటుకులు, పాలు, బెల్లం సమర్పణ.

మూడో రోజు–ముద్దపప్పు బతుకమ్మ: పప్పు, నూనె, బెల్లం పూజా సమర్పణ.

నాలుగో రోజు–నానాబియ్యపు బతుకమ్మ: బియ్యం, పప్పు, వేరుశెనగలతో ప్రత్యేకత.

ఐదో రోజు– అట్ల బతుకమ్మ: అట్లతో పూజలు చేసి పొరుగింటివారితో పంచుకోవడం.

ఆరవ రోజు– చొక్క బతుకమ్మ: పప్పు వంటలతో అమ్మవారిని ఆరాధించడం.

ఏడో రోజు: వేప బతుకమ్మ: వేప ఆకులతో ప్రత్యేక బతుకమ్మ.

ఎనిమిదో రోజు–వేన బతుకమ్మ: పల్లెల్లో విందులు, విందు వంటలు.

తొమ్మిదో రోజు–సద్దుల బతుకమ్మ: అత్యంత ఘనమైన ముగింపు. చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం, పెద్ద విందులు.

**ఆటపాటలు–సంస్కృతికి ప్రతిబింబం**

బతుకమ్మ చుట్టూ మహిళలు పాడే పాటల్లో పల్లె జీవనం, పంటల సంతోషం, కుటుంబ బంధాలు ప్రతిబింబిస్తాయి. అమ్మవారిని స్తుతిస్తూ గీతాలు పాడుతూ స్త్రీల ఐక్యతను ప్రదర్శిస్తారు. ఆధునిక కాలంలో యువత కూడా డప్పులు, కర్రాటాలు, డీజేలతో పండుగకు కొత్త రంగులు జోడిస్తున్నారు. సాంప్రదాయం, ఆధునికత కలిసిపోతూ ఈ పండుగ విశిష్టతను చాటుతోంది.

**పూల ప్రాధాన్యం–ప్రకృతితో అనుబంధం**

బతుకమ్మలో ఉపయోగించే పూలన్నీ స్థానికంగా లభించే ఔషధ గుణాలు కలిగినవే. తీరక్క, గుమ్మడి, బంతి, చామంతి, గున్నె వంటి పువ్వులు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పూల పరిమళం, రంగులు మనసుకు హాయినిచ్చి పండుగ వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మారుస్తాయి.

**అవసరత–ఆత్మగౌరవానికి ప్రతీక**

బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని పూజించడం, కుటుంబ సంక్షేమం కోసం ప్రార్థించడం విశేషం. ఈ పండుగ ద్వారా పల్లెపల్లెల్లో ఐక్యత పెరుగుతూ, సమాజం మొత్తం కలిసికట్టుగా ఉండే స్ఫూర్తి లభిస్తుంది.

***ముగింపు:*** తొమ్మిది రోజుల పాటు పూలతో, గీతాలతో, ఆటపాటలతో సాగిన బతుకమ్మ పండుగ చివరి రోజు సద్దుల బతుకమ్మ నిమజ్జనంతో ముగుస్తుంది. అయినప్పటికీ పల్లెల్లో, పట్టణాల్లో మిగిలేది ఆ ఆనందం, ఆ ఉత్సాహం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు పండుగను మరింత అందంగా మార్చాయి. బతుకమ్మ కేవలం పుష్పోత్సవం కాదు, అది తెలంగాణ ఆత్మకు ప్రతీక, ప్రపంచానికి పరిచయం చేస్తున్న గర్వకారణమైన పండుగ.



## జీఎస్టీ డబుల్ బొనంజా!

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి దుకాణదారుడు దేశంలో తయారైన వస్తువులను మాత్రమే అమ్మాలని పునరుద్ఘాటించారు. ఈ విధానం దేశంలో స్వదేశీ స్వావలంభన విధానాన్ని బలపరుస్తుందని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధానాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.జీఎస్టీ సంస్కరణలు దేశంలోని వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను సులభతరం చేస్తాయని, ఇప్పటికే 2014కి ముందు అనేక రకాల పన్నులు ప్రజలు భరిస్తుండేవని చెప్పారు. ఎంట్రీ టాక్స్, అమ్మకపు పన్ను, ఎక్సైజ్, వ్యాట్, సేవా పన్నుల భారం తొలగించబడిందని, జీఎస్టీ ద్వారా అన్ని వస్తువులపై ఒకే పన్ను విధానం అమలులో ఉందని చెప్పారు.జీఎస్టీ కొత్త శ్లాబ్‌లు సెప్టెంబర్ 3న ప్రకటించబడి 5, 12, 18, 28 శాతాల నుండి 5, 18 శాతాలకు తగ్గించబడ్డాయి. సిమెంట్ పై 28 శాతం నుంచి 18 శాతం, టీవీలు, ఏసీలపై 28 శాతం నుంచి 8 శాతం తగ్గింపు, ఆరోగ్య బీమాపై పన్ను సున్నా, చినకార్లు, ఆటో విడిభాగాలపై 28 శాతం నుంచి 18 శాతం తగ్గింపు లభించనుంది. పొగాకు, పాన్ మసాలా, కార్బోనేటెడ్ పానీయాలు, పెద్ద కార్లు, విలాసవంతమైన వస్తువులపై 40 శాతం జీఎస్టీ వర్తించనుంది. ఆహార పదార్థాలు, పనీర్, రొట్టెలపై పూర్తి మినహాయింపు ఉంది.ఒక వస్తువు రూ. 100 అయితే, 18 శాతం జీఎస్టీ తర్వాత మొత్తం రూ. 118 అవుతుంది. 5 శాతానికి తగ్గించిన తర్వాత ఆ వస్తువు రూ. 105కి లభిస్తుంది (రూ. 13 ఆదా). మారుతీ సుజుకి ఆర్టిగా, డిజైర్, వెగన్ ఆర్, బలెనో వంటి కార్లపై రూ. 32,000 నుంచి రూ. 81,000 వరకు తగ్గింపు వస్తుంది. పాతవైనా కొత్త జీఎస్టీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.జీఎస్టీ తగ్గింపుకు దుకాణదారులు నిరాకరిస్తే ఫిర్యాదు చేయవచ్చని, కేంద్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్లు 1800-11-4000, 1800-1200-232 ద్వారా కాల్ చేయవచ్చని, నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చని, బిల్లు కాపీ, దుకాణదారుడి పేరు, చిరునామా సమర్పించవలసిందని తెలిపారు.జీఎస్టీ అమలు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తరువాత సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ కొత్త శ్లాబ్‌లు సెప్టెంబర్ 22 నుంచి అమలు కానున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా సామాన్యుల కొనుగోలు వస్తువులపై పన్ను తగ్గింపుతో, నవరాత్రుల సందర్భంగా కాంతులు కొత్త వెలుగులు పంచతాయని, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.




## దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

- సిద్ధంగా ఉండాలని పోల్ అధికారులకు ఈసీ ఆదేశం
- అక్టోబర్-నవంబర్‌లో ఓటర్ లిస్ట్ క్లీనప్ వ్యాయామం ప్రారంభం

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** బిహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరహాలోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది. ఇందుకోసం సెప్టెంబర్ 30వ తేదీలోగా సన్నద్ధం కావాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలిచ్చింది. ఓటర్ లిస్ట్ క్లీనప్ ఎక్సర్‌సైజ్‌ను అక్టోబర్–నవంబర్ నాటికి ప్రారంభించనున్నట్టు సంకేతాలిచ్చింది.బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్టు ఈసీ ఇటీవల ప్రకటించింది. 2026లో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. పుట్టినస్థలం రికార్డులను పరిశీలించి అక్రమ విదేశీ వలసదారులను జాబితా నుంచి తప్పించడం ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యంగా ఉంది.రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులతో న్యూఢిల్లీలో ఈసీ ఇటీవల సమావేశం నిర్వహించింది. రాబోయే 10–15 రోజుల్లో ఎస్ఐఆర్ రోల్‌అవుట్‌కు సిద్ధంగా ఉండాలని ఈసీ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఆదేశాలిచ్చారు. లాంఛనంగా సెప్టెంబర్ 30వ తేదీని చివరితేదీగా నిర్ణయించారు. చివరిసారిగా నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ లిస్ట్‌ను సిద్ధంగా ఉంచాలని ఈసీ ఆదేశాలిచ్చింది. గత ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలను పలు రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ఉంచారు.న్యూఢిల్లీలో చివరిసారిగా 2008లో ఎస్ఐఆర్ నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఎస్ఐఆర్ నిర్వహించారు. చాలా రాష్ట్రాల్లో చివరిసారి ఎస్ఐఆర్ 2002–2004 మధ్య జరిగింది.

## కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు

- పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్
- నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న యువతి ఫిర్యాదు



**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసులు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆయన కంపెనీలో నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న ఓ యువతి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు అయింది. విధి నిర్వహణలో ఉన్న సమయంలో కేఏ పాల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. దీనికి సంబంధించి వాట్సాప్ సందేశాలను కూడా ఆమె పోలీసులకు సమర్పించింది.ఈ ఫిర్యాదును స్వీకరించిన పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.

# గాజులరామారంలో హైడ్రా ఆపరేషన్

- 15 వేల కోట్ల విలువైన భూమికి విముక్తి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సర్వే నంబర్ 307 భూమి పై ఆక్రమణలు తొలగింపు
- రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన 300 ఎకరాల భూమి కాపాడటంలో ఫుల్ ఫోర్స్



**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–సెప్టెంబర్ 21:** మేడ్చల్%–%మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో ఆదివారం ఉదయం హైడ్రా ఆపరేషన్ పూర్తి శక్తితో ప్రారంభమైంది. సుమారు 300 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడేందుకు దానిపై గల అక్రమ ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ఫుల్ ఫోర్స్‌తో రంగంలోకి దిగారు.అధికారుల వివరాల ప్రకారం సర్వే నంబర్ 307లోని ఈ భూమి సుమారు 15 వేల కోట్ల రూపాయల విలువ కలిగిన మహత్తర ఆస్తి ఇక్కడ పెద్దమనుషుల ఆధ్వర్యంలో పేదవారిని ముందుగా పెట్టి, భూమిపై అక్రమంగా వెంచర్లు వేసి, ప్లాట్లుగా విక్రయాలు చేసారని గుర్తించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన ఈ భూమిలోని పెద్దబాబులు వేయించిన షెడ్డులను తొలగించడం కూడా ఆపరేషన్‌లో భాగంగా జరుగుతోంది.హైడ్రా బృందం నివాసాల జోలికి వెళ్లకుండా కాబట్టి ప్రజలకు అంతరాయం రాకుండా కబ్జాలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆక్రమణల తొలగింపు చర్యలు ప్రామాణిక విధానాల ప్రకారం ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా నడుస్తున్నాయి.ఇప్పటివరకు భూమి పై ఉన్న కొంతమంది అక్రమ ఆక్రమణదారులు స్వచ్ఛందంగా భూమి ఖాళీ చేసినా, పెద్ద ఎత్తున ఉన్న కబ్జాలను తొలగించడం కోసం పూర్తి సైనిక, పోలీసులు, మరియు హైడ్రా బృందం ఉత్సాహంగా కృషి చేస్తున్నారు. ఈ చర్య ద్వారా భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ జరగకుండా భూమి భద్రత కోసం బలమైన సందేశం ఇవ్వబడనుంది.హైడ్రా ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత, భూమిని ప్రభుత్వం నిర్ధారించిన విధంగా పునర్వినియోగం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతాయి. ఈ చర్య స్థానిక ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడం, భవిష్యత్తులో భూమి అక్రమ ఆక్రమణలను నియంత్రించడానికి కీలకంగా భావిస్తున్నారు.



# రాష్ట్రంలో క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట







**-ఎమ్మెల్యే మేఘారెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి**

**-వనపర్తిలో 11వ అంతర్ జిల్లా సెపక్ తక్రా ఛాంపియన్ షిప్ క్రీడలు ప్రారంభం**

**-పెద్ద మందడి, ఘనపూర్ మండలాలకు మినీ స్టేడియాలు మంజూరు**

**-జిల్లా కేంద్రంలో 9 ఎకరాల్లో క్రికెట్ స్థలం ఏర్పాటు**

**-వనపర్తి జిల్లాకు 57 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ మంజూరు**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తూనే క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా రాణించేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డిలు అన్నారు. ఆదివారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్ తక్రా చాంపియన్షిప్ క్రీడా పోటీలకు స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

అంతకుముందు ప్రముఖ క్రీడాకారుడు, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చాంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, క్రీడా జ్యోతిని వెలిగించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహబూబ్నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య ఆటల పోటీలను ప్రారంభించారు.

ఈ టోర్నమెంట్లో తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా నుంచి మెన్స్ ఉమెన్స్ రెండు జట్లు చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రూ.800 కోట్లు క్రీడలకు కేటాయించిందని చెప్పారు. రాష్ట్రంలో క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేందుకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. సెపక్ తక్రా క్రీడకు సంబంధించి బాల్స్ కొనుగోలు చేసేందుకు కొంత ఇబ్బందులు ఉన్నట్లు తెలిసిందని ఇందుకు సంబంధించి అట్టి క్రీడకు సంబంధించిన అసోసియేషన్ వారు తమకు నివేదిక ఇస్తే మలేషియా నుంచి బంతుల్ని తెప్పించేందుకు తప్పనిసరిగా కృషి చేస్తామన్నారు. వనపర్తి జిల్లాకు 57 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ శాంక్షన్ చేయడం జరిగిందని చెప్పారు. వచ్చే ఏడాదికి వనపర్తిలో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తెచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి విద్యాపర్తి మాత్రమే కాదని క్రీడలకు కూడా నిలయమని అన్నారు. క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి వనపర్తి వారే కావడం, రాష్ట్ర క్రీడా మంత్రి కూడా ఉమ్మడి పాలమూరు జిల్లా వారే కావడం ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. సీఎం రేవంత్ కూడా క్రీడల పట్ల చాలా మక్కువ ఉంటుందని, ఇక్కడే చదువుకొని ఇక్కడే అనేక క్రీడల్లో పాల్గొన్నారన్నారు. క్రీడాకారులకు ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా హైదరాబాద్లోని క్రీడా ప్రాధికార సంస్థకు వెళ్లి కలిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. పెద్దమందడి, ఘనపూర్ మండలాలకు మినీ స్టేడియంలు శాంక్షన్ చేసిన సీఎంకు, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో 9 ఎకరాల్లో క్రికెట్ కోసం స్థలాన్ని కేటాయించినట్లు కూడా ఎమ్మెల్యే తెలియజేశారు. సెపక్ తక్రా క్రీడల్లో రాణించి ఇన్కమ్ టాక్స్ విభాగంలో ఉద్యోగాన్ని సంపాదించిన ఘనపురం అమ్మాయి నవతను ఎమ్మెల్యే అభినంది ంచారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అందరూ క్రీడల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ వ్యాపారి ఎస్ ఎల్ ఎన్ రమేష్, సెపక్ తక్రా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సెక్రెటరీ పబ్బ భాస్కర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బి. కృష్ణ, వరప్రసాద్ రావు, బ్రహ్మం చారి, యాపర్ల రామ్ రెడ్డి, సత్యం సాగర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



# అగ్నివీర్ శిక్షకులకు టీ షర్టులు, షాట్స్ వితరణ

**-అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం**

**-వనపర్తి సిఐ కృష్ణయ్య**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ అయ్యాపురెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు (అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్) ఏసిటిఓ ప్రసన్న కుమార్ రెడ్డి తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సీఐ కృష్ణయ్య అన్నారు. విశ్రాంత ఆర్మీ జవాన్ ప్రస్తుత యూనియన్ బ్యాంక్ లో క్యాషియర్ గా విధులు నిర్వహిస్తున్న గబ్బర్ సింగ్ 38 మంది నిరుద్యోగ యువకులకు అగ్నివీర్ ఉద్యోగాల కోసం సొంత నిధులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. గతంలోనే నాలుగు బ్యాచులకు శిక్షణ ఇప్పించి ఎంతోమందిని దేశ సేవకు పంపడం జరిగిందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే అయ్యప్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ తరపున పెద్దమందడి మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన తనయుడు ప్రసన్న కుమార్ రెడ్డి కూడా అగ్ని వీర్ శిక్షకులకు తన వంతు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం సీఐ కృష్ణయ్య, చిన్నంబావి ఎస్సై జగన్ ల నేతృత్వంలో గబ్బర్ సింగ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం 38 మంది శిక్షకులకు అయ్యప్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ తరపున నాణ్యమైన టీ షర్టులు, షాట్స్ వితరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# జగత్ పల్లి మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి

పెద్దమందడి నేటి ఫోకస్:



మండల పరిధిలోని జగత్ పల్లి గ్రామానికి చెందిన బోయ చిట్టెమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 32000 మంజూరైనట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటన్న యాదవ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చొరవతో బాధితురాలికి సీఎం సహాయ నిధి కింద చెక్కు మంజూరు అయిందని ఆయన తెలిపారు. ఆదివారం జగత్ పల్లి లోని చిట్టెమ్మ ఇంటికి వెళ్లి మంజూరైన 32 వేల విలువగల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెంటన్న, హుస్సేన్, రాములు, వెంకట్ రాములు, చెన్నయ్య, ఆశన్న, బోయ వెంకటయ్య, గిరన్న, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

**టియుడబ్ల్యూ జె (ఐ జె యూ) జిల్లా అధ్యక్షులు మాధవరావు కు సన్మానం**

**-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:



నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 11వ అంతర్ జిల్లా సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ సెపక్ తాక్రా చాంపియన్షిప్ క్రీడా పోటీలకు శివసేన రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్రీడలకు వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస గౌడ్ అధ్యక్షత వహించారు. అనంతరం టియుడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాధవరావు ను ఆప్యాయతగా ఆలింగనంతో పాటు కరచాలనం చేసి ఆయనతో ముచ్చటించారు. ఇటీవల నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతగా తీసుకున్న మాధవరావును ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు నిరంతర శ్రామికులని, ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదలను ఎత్తిచూపుతూ ప్రజలకు ప్రశ్నించే గొంతుకలుగా నిలబడుతుండడం చాలా గర్వకారణమని అన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తో పాటు భాస్కర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, గట్టు వెంకన్న, ఉప్పల భాస్కర్, జగదీశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నాచారం, సెప్టెంబర్ 21 నేటి ఫోకస్ న్యూస్ :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర భక్త సమాజం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు. జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, నాయకులు మల్కా ప్రకాష్, అనిత రెడ్డి, దయానంద్ గౌడ్, సీనియర్ సిటిజన్లు సాయిబాబా, శ్రీశైలం గౌడ్, డివిజన్ నాయకులు వెంకట్ నాయక్, నవీన్ గౌడ్, టిల్లు, రాజిరెడ్డి, ఆనంద్ గుప్తా, అమర్, బాలకృష్ణ, శేఖర్ గుప్తా, వరలక్ష్మి, సురేందర్,తదితరులు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీలో చేరిక



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 21

కళ్ళు గీతా కార్మికులకు కాంగ్రెస్ పార్టీ లో చేరిక. తాము ఇష్టపూర్తిగానే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు. బీఆర్ఎస్ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని వెలికట్ట గౌడ సంఘ నాయకులు తెలిపారు.

వెలికట్ట గ్రామం నుంచి కాంగ్రెస్ లో చేరిన గౌడ సంఘ నాయకులు అన్నపురం వెంకట సోములు, దీకొండ విజయ్ బాబు,దికొండ రామ్మూర్తి, పొన్నం కొమరయ్య, చామకూర వెంకన్న, దీకొండ రమేష్, ఐలయ్య లు ఆదివారం మాట్లాడారు. గౌడ సంఘం నాయకులు ఎలాంటి ఒత్తిడి లేకుండా సమిష్టిగా నిర్ణయం తీసుకొని ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు,గీతా కార్మికులకు అండగా నిలుస్తుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని,బీసీలు బలహీనవర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్ కు అండగా ఉండటమే సముచి నిర్ణయం అని భావించామని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గం లో బీసీలు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి విచక్షణారహితంగా మాట్లాడుతున్నారని,రోజురోజుకు ఆ పార్టీ పరిస్థితి దిగజారి పోతుందని తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా నిలిపేందుకు గౌడ సంఘం నాయకులు అండగా ఉంటారన్నారు.



# తెలంగాణకు ప్రాణం పోసిన మహనీయుడికి ఘన నివాళి

హైదరాబాద్ ,సెప్టెంబర్ 21 నేటి ఫోకస్ న్యూస్ :

తెలంగాణ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన స్వాతంత్ర సమరయోధుడు, రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడి జీవితాన్ని అర్పించిన మహానీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ %-% "బాపూజీ తెలంగాణ ఉద్యమానికి ఆత్మవిశ్వాసం నింపిన వ్యక్తి. ఆయన చూపించిన మార్గం మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. తెలంగాణ సమాజం, ముఖ్యంగా యువత ఆయన స్ఫూర్తిని ఆలంబనగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాపూజీ సేవలను స్మరించుకున్నారు.

# వెంకటసాయి ఎన్ క్లేవ్ కాలనిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మీర్ పేట్ నేటి ఫోకస్ న్యూస్:



మీర్ పేట్ మునిసిపల్ కార్పొరేషన్ వెంకటసాయి ఎన్ క్లేవ్ కాలనిలో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ ఎనుగుల అనిత అనిల్ కుమార్ యాదవ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నలంద స్కూల్‌పై చర్యలు తీసుకోండి

**విద్యార్థులపై అధిక ఒత్తిడి**

**జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్**

**హ్యూమన్ రైట్స్ డివిజన్ ప్రెసిడెంట్ పల్లెర్ల రమేష్**

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 21






ఆదివారం తొర్రూర్ డివిజన్ మున్సిపల్ కేంద్రంలో బీరప్ప నగర్ లో ఉన్న నలంద స్కూల్లో ఈరోజు బతుకమ్మ అమావాస్య రోజు ఉదయం నుంచి సైన్స్ క్లాసులు జరుగుతుండగా అధిక ఒత్తిడికి గురవుతున్న కొంతమంది విద్యార్థులు వారి హక్కులకు భంగం కలుగుతున్న తరుణంలో వారి కోసం స్పందించిన డివిజన్ కమిటీ వెంటనే సంఘటన స్థలానికి చేరి సంబంధిత ప్రిన్సిపాల్ ఎంఈఓ బుచ్చయ్య సార్ తో విషయాన్ని చెప్పి విద్యార్థులను ఇంటికి పంపించడం జరిగింది. కానీ వాస్తవానికి విద్యార్థులపై అధిక భారాన్ని మోపుతున్నారని యాజమాన్య పై మండిపడ్డారు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్, విద్యార్థులకు బంధువులతో గడిపే సమయం లేదా టీచర్లకు పై అధికారులకు అసలు ఏం చెబుతున్నారు ఈ పరిస్థితి మీకు మీ పిల్లలకు ఎదురైతే మీరు ఏమి చేస్తారు అని సమాధానం మీరు చెప్పాలని అన్నారు. అధిక మార్కులు ర్యాంకులు కొట్టాలని అతి ఉత్సాహం చూపిస్తున్న యాజమాన్యాలు కనీసం పండగానే చూడకుండా నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు మళ్ళీ జరిగితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు , అధిక క్లాసులు అధిక ఒత్తిడి ఎక్కువగా అయినప్పుడు కుటుంబ సభ్యులు తల్లిదండ్రుల మీద పిల్లలు విరుచుకుపడుతున్నారని మంగళ పెల్లి హుస్సేన్ అన్నారు, సైకాలజీ ప్రకారం కొంత స్వేచ్ఛ అవసరమని పిల్లలకు వినోదం, విజ్ఞానం, ఆట, పాట, పండుగ, అవసరమని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య. డివిజన్ ప్రెసిడెంట్ పల్లెల్లో రమేష్, మండల ప్రెసిడెంట్ కొండ్లె ఉమేష్, జాయింట్ సెక్రటరీ గంట్ల సతీష్, కమిటీ మెంబర్ నాలము శ్రీనివాస్,మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు గారవీర స్వామి, విద్యార్థులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు,

# పూలోత్సవ శోభ

- బతుకమ్మ సంబరాలకు శ్రీకారం
- తొమ్మిది రోజుల పూల పండుగలో ఉత్సాహం

పెద్దవంగర, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-సెప్టెంబర్ 21

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ బతుకమ్మ. పూలతో దేవుని కొలుస్తున్నా, పూలనే దైవంగా ఆరాధించే ఏకైక పండుగగా బతుకమ్మ ప్రత్యేకత సంతరించుకుంది. ఎంగిలిపూలతో ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు ఊరూవాడా సందడిగా సాగనున్నాయి.

**ప్రకృతి పూలతో బతుకమ్మ అందాలు..**

పెద్దవంగర మండలంలోని పలు గ్రామాలలో గునుగు, తంగేడు, చామంతి, జాజి, రుద్రాక్ష, కట్ల, గానుగ, బీర, గుమ్మడి, మందార వంటి పూలను అడవుల నుండి సేకరించి ఇత్తడి తాంబాలంలో పేర్చిన బతుకమ్మలు అలరారుతున్నాయి. మహిళలు గౌరమ్మను ఆరాధిస్తూ పాడే బతుకమ్మ పాటలు జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**తీరొక్క పూలతో ఆట పాటల సందడి..**

ప్రతి సాయంత్రం గ్రామాల ప్రధాన కూడళ్లలో తీరొక్క పూలతో తయారైన బతుకమ్మలను సమకూర్చి, చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, వలయాకారంగా తిరుగుతూ మహిళలు ఆనందోత్సాహాలతో ఆడిపాడుతారు. ఆ పూల అందాలు, గాజుల చప్పట్లు, ఊరంతా కిలకిలారావాలతో పండుగ వాతావరణం నెలకొంటుంది.

**తొమ్మిది రోజులు.. తొమ్మిది నైవేద్యాలు..**

1. మొదటి రోజు–ఎంగిలిపూల బతుకమ్మ: నువ్వులు, బియ్యంపిండి, నూకలతో నైవేద్యం.

2. రెండో రోజు–అటుకుల బతుకమ్మ: సప్పిడి పప్పు, బెల్లం అటుకులు.



3. మూడో రోజు–ముద్దపప్పు బతుకమ్మ: పాలు, బెల్లం, ముద్దపప్పుతో.

4. నాలుగో రోజు–నానెబియ్యం బతుకమ్మ: నానబెట్టిన బియ్యం, పెరుగు తో.

5. ఐదో రోజు–అట్ల బతుకమ్మ: అట్లు లేదా దోశలు అమ్మవారికి నైవేద్యం.

6. ఆరో రోజు–అలిగిన బతుకమ్మ: ఆశ్వీయుజ పంచమి రోజున బతుకమ్మ పేర్చరు.

7. ఏడో రోజు–వేపకాయల బతుకమ్మ: బియ్యంపిండితో వేపకాయలు చేసి సమర్పణ.

8. ఎనిమిదో రోజు–వెన్నముద్దల బతుకమ్మ: వెన్న, నువ్వులు లేదా నెయ్యి, బెల్లం తో.

9. తొమ్మిదో రోజు–సద్దుల బతుకమ్మ: ఐదు రకాల అన్నాలు (పెరుగన్నం, పులిహోర, లెమన్రైస్, కొబ్బరన్నం, నువ్వులన్నం).

**సద్దుల బతుకమ్మతో ముగింపు..**

సద్దుల బతుకమ్మతో వేడుకలు ఘనంగా ముగుస్తాయి. అమ్మవారికి ఐదు రకాల నైవేద్యాలను సమర్పించి, బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. "పోయిరా బతుకమ్మ.. వెళ్లిరావమ్మ.. మళ్లీ వచ్చే ఏడాది తిరిగి రావమ్మా" అని పాటలతో వీడ్కోలు పలుకుతారు.

**పూలను కొలిచే పండుగ..**

ప్రపంచంలో పూలను కొలిచే ఏకైక పండుగ బతుకమ్మ. ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి నిర్వహించుకునే వేడుక ఇది. ఇటు పుట్టినిల్లు, అటు



మెట్టినిల్లు అందరూ సఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటాం.

**తెలంగాణ సంస్కృతి మూలాలు..**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగను ఉత్సహంగా జరుపుకుంటారు. ఈ పండగతో తెలంగాణ సంస్కృతి మూలాలు తెలుసుకునే గొప్ప అవకాశం ఉంటుంది. ఇలాంటి సాంస్కృతి నేటి సమాజానికి ఎంతో అవసరం. మన పండగకు ప్రపంచ ఖ్యాతి వచ్చింది.



# పట్నం పల్లెబాట

- కిక్కిరిసిన బస్టాండ్లు, ఆర్టీసీ బస్సులు
- దసరా సెలవులు మొదలవడంతో ఊర్లకు పయనమైన జనం
- స్పెషల్ బస్సుల్లో టిక్కెట్ ధరలు పెంపుపై ప్రయాణికుల ఆందోళన

పట్నం పల్లె వైపు కదులుతున్నది. దసరా సెలవులు రావడంతో నగర ప్రజలంతా ఊరి బాటపడుతున్నారు. ఆదివారంతో సెలవులు ప్రారంభం కావడంతో బస్సుల్లో రద్దీ మరింత పెరిగింది. మహానగరం నుంచి గ్రామాలకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా రద్దీ కొనసాగుతూనే ఉంది. దీంతో నగరంలోని ప్రధాన బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎంజీబీఎస్‌తో పాటు జేబీఎస్, ఉప్పల్ రింగ్ రోడ్డు, ఎల్బీనగర్ చౌరస్తా, ఆరాంఘర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో రద్దీ విపరీతంగా ఉంటోంది.

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 21:

మహాలక్ష్మి పథకం కింది మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండటంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీట్లు దొరకక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రెట్టింపు చార్జీలున్నా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో వెళ్తున్నారు. కొన్ని డిపోల నుంచి వెళ్లే బస్సుల్లో చిన్న పిల్లలకు కూడా పూర్తి చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే స్పెషల్ బస్సుల్లో చిన్న పిల్లలకు కూడా పూర్తి చార్జీ చెల్లించాలని చెప్తున్నట్లు తెలుస్తున్నది.

దసరా పండుగకు ఊర్లకు వెళ్లే ప్రయాణికుల కోసం స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. అదనంగా నడుపుతున్న బస్సుల్లో టిక్కెట్ ధరలను పెంచుతున్నట్లు వెల్లడించింది. కానీ ఆయా ఏరియాల్లో ఇప్పటికే నడుస్తున్న బస్సుల్లో కూడా అదనపు ఛార్జీలు తీసుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. స్పెషల్ బస్సులు ఏవో.. సాధారణ బస్సులు ఏవో చెప్పాలంటూ కండక్టర్లు, డ్రైవర్లను ప్రశ్నిస్తున్నారు. వారు ఎలాంటి సమాధానం చెప్పకుండానే అదనపు ఛార్జీలు చెల్లించాల్సిందేనని తేల్చి చెప్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

నగరం నుంచి అన్ని రూట్లకు వెళ్లే బస్సుల్లోనూ అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీతో సహా అన్ని సర్వీసుల్లో అదనపు చార్జీలు బాదుతున్నారని మండిపడుతున్నారు. సర్వీసును బట్టి రూ.50 నుంచి రూ.150 వరకు అదనంగా వడ్డిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా చిన్న పిల్లలకు కూడా పూర్తి చార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పండగపూట సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధరలపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహాలక్ష్మి ఉచిత ప్రయాణాన్ని తగ్గించేందుకు కొన్ని రూట్లలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను గణనీయంగా తగ్గిస్తున్నారని మహిళా ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య తగ్గడంతో మహిళలకు సీట్లు దొరక్కపోవడంతో గొడవలు పడుతున్నారు. సీట్ల కోసం పాట్లు పడుతున్నారు. పురుషులైతే పెరిగిన ధరలకు టిక్కెట్లు కొని మరీ మూడు, నాలుగు గంటల నిలబడే ప్రయాణించాల్సి వస్తున్నది. చిన్న పిల్లలు, వృద్ధులకు కూడా సీట్లు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నడుస్తున్న కొద్దిపాటి బస్సుల్లో సీట్ల కోసం కొట్లాటలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పండగ రద్దీ.. మరోవైపు ధరల మోతతో పాటు మహాలక్ష్మి పథకం వర్తించే బస్సులు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మెజార్టీ బస్సులను సమాన్య రోజుల్లో అందుబాటులో ఉంచి పండుగ రోజుల్లో తగ్గించడమేంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

# నిఫ్ట్ ఫ్యాషన్ షో..
# మోడల్స్ హొయలు..!

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నాగోల్ శివం కన్వెన్షన్‌లో ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్సులు పూర్తయిన నేపథ్యంలో గ్రాడ్యుకేషన్ డేని ఘనంగా నిర్వహించారు. తొలుత %చీ×ఖీణ% విద్యార్థులు నేర్చుకున్న అనేకమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన డిజైన్లన ఫ్యాషన్ షోలో ప్రదర్శించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నాగోల్ శివం కన్వెన్షన్‌లో ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్సులు పూర్తయిన నేపథ్యంలో గ్రాడ్యుకేషన్ డేని ఘనంగా నిర్వహించారు. తొలుత %చీ×ఖీణ% విద్యార్థులు నేర్చుకున్న అనేకమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన డిజైన్లన ఫ్యాషన్ షోలో ప్రదర్శించగా.. వాటిని ధరించి మోడల్స్ ర్యాంప్‌పై వాక్ చేశారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసం వెంకటేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, గ్లోరియస్ మిస్ ఇండియా 2025 పూజ పటేల్, మిస్ ఇండియా రన్నర్ ఆఫ్ సిమ్రాన్ పారిక్ వంటి సెలబ్రిటీలు పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.





# రాష్ట్రవ్యాప్తంగా మొదలైన బతుకమ్మ పండగ

- ఎంగిలిపూల బతుకమ్మల వద్ద మహిళల సందడి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఘనంగా వేడుక
- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి,
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- గ్రేటర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు తెలంగాణ
- సంస్కృతి, చెరువులు, ఆలయాల వద్ద ఆడిపాడిన మహిళలు



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 21:

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురం రాష్ట్ర వ్యాప్తంగా మొదలైంది. తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల, గులాబీ, బంతి పూలతో అందంగా పేర్చిన ఎంగిలి పూల బతుకమ్మల చుట్టూ.. ఏమేమీ పువ్వొప్పునే గౌరమ్మా.. ఏమేమీ కాయొప్పునే..!!, బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో... అంటూ ఆడి, పాడిన మహిళా లోకం తొమ్మిది రోజులు పాటు సాగే బతుకమ్మ వేడుకలకు ఆదివారం అట్టహాసంగా శ్రీకారం చుట్టింది. పల్లె నుంచి పట్టణం దాకా ప్రతి ఊరిలో, ప్రతి వీధిలో పండగ శోభ సంతరించుకోగా.. ఎక్కడికక్కడ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ వేయి స్తంభాల గుడి ఆవరణలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, సంగీత నాటక అకాడమి చైర్‌పర్సన్ అలే ఖ్య తదితరులు పాల్గొన్నారు. వేయి స్తంభాల గుడి వద్దకు బతుకమ్మలతో వచ్చిన మంత్రులు సీతక్క, సురేఖ.. ఆ తర్వాత మహిళలతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడారు. వేయి స్తంభాలు గుడి పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఇక, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతీలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో బహుజన బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రామంలో అమరులైన సంజీవ్, జాన్సన్, అక్తర్, కనకయ్యను వేడుకలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గుర్తు చేసుకుని ఆమె కంటతడి పెట్టుకున్నారు. ఇక, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

**గ్రేటర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తొలిరోజు ఆదివారం (ఎంగిలి పూల బతుకమ్మ) గ్రేటర్ వ్యాప్తంగా కన్నుల పండగగా సాగింది.‘ చిత్తూ చిత్తూల బొమ్మ..శివుడీ ముద్దుల గుమ్మా’ అంటూ మహిళలు ఆడిపాడారు.



స్థానికంగా ఉండే ఆలయాలకు మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మను నెత్తిన పెట్టుకొని రావడంతో సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా 384కి పైగా బతుకమ్మ కుంటలు,చెరువులు, తాత్కాలిక కుంటలు, ట్యాంకులను జీహెచ్ఎంసీ సిద్ధం చేసింది. ప్రజల సౌకర్యార్థం 82 తాత్కాలిక మరుగుదొడ్లు, 45వేల తాత్కాలిక విద్యుత దీపాలు ఏర్పాటు చేశారు. వేడుకలు జరుగుతున్న ప్రదేశాలలో 1,450 శానిటేషన్ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాన వేడుకల వేదికలు పీపుల్ ప్లాజా–నెక్లెస్‌రోడ్, ఎల్బీ స్టేడియం, జల విహార్, కాప్రా చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సరూర్‌నగర్ చెరువు, చార్మినార్, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ముషీరాబాద్, బేగంపేట, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో తొలి రోజు సందడి కనిపించింది. మహిళా సంఘాలు, వలంటీర్లు, స్థానిక సంఘాల సహకారంతో బతుకమ్మ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో మరింత ఉత్సాహభరితంగా సాగాయి.